క్లుప్తంగా

నేడు వాహనాల వేలం

లింగపాలెం : వివిధ కేసుల్లో పట్టుబడ్డ మోటార్‌సైకిళ్లకు ఎస్పీ ఆదేశాల మేరకు ధర్మాజీగూడెం పోలీస్‌ స్టేషన్‌లో శనివారం ఉదయం 9 గంటలకు వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్సై పి.చెన్నారావు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఆధార్‌ కార్డుతో హాజరుకావాలన్నారు.

ఇసుక దోపిడీని అరికట్టాలని ధర్నా

కుక్కునూరు : మండలం నుంచి తెలంగాణకు ఇసుకను అక్రమంగా రవాణ చేస్తున్న వ్యక్తులపై చర్యలు చేపట్టాలని కోరుతూ సీపీఎం నాయకులు శుక్రవారం కుక్కునూరు తహసీల్దార్‌ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ, మండలంలోని ఇబ్రహీంపేట ర్యాంపు నుంచి గోదావరి ఇసుకను రాత్రి, పగలు తేడా లేకుండా లారీలలో తెలంగాణ ప్రాంతాలకు విచ్చలవిడిగా రవాణా చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు స్పందించి అక్రమ రవాణ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. నాయకులు యర్నం సాయికిరణ్‌, మేడిపల్లి బాబు, కోట మోహన్‌రావు, సాయి పాల్గొన్నారు.

మన్యంలో చల్లబడిన వాతావరణం

బుట్టాయగూడెం : గత వారం రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు కూడా నమోదయ్యాయి. ప్రచండ భానుడి ప్రతాపంతో ఎండలతో సతమతమవుతున్న పశ్చిమ మన్యం ప్రజలు శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో ఒక్కసారిగా వాతావరణం చల్లబడడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఉరుములు, మెరుపులతో, చిరుజల్లులతో తీవ్రమైన ఈదురు గాలులు వీచాయి. దీంతో వాతావరణం చల్లబడి ప్రజలకు ఉపశమనం లభించింది. అయితే వాతావరణ శాఖ ఉపరితల ద్రోణి ఆవరించి వర్షాలు పడే అవకాశం ఉందని చెప్పిన నేపథ్యంలో ఒక్కసారిగా మారిన వాతావరణంతో ప్రజలు ఉపశమనం పొందుతున్నారు.

స్పోకెన్‌ ఇంగ్లిష్‌పై అవగాహన

ద్వారకాతిరుమల: స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో భాగంగా శుక్రవారం గ్రంథాలయ అధికారిణి గుర్రం బంగారు పాప విద్యార్థులకు స్పోకెన్‌ ఇంగ్లిష్‌పై అవగాహన కల్పించారు. అలాగే పుస్తక పఠనం చేయించారు. ఈ సందర్భంగా బంగారు పాప మాట్లాడుతూ తెలుగుతో పాటు ఇంగ్లిష్‌పై కూడా విద్యార్థులు పట్టు సాధించాలన్నారు. గ్రంథాలయ సహాయకురాలు బట్టు మణి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కామవరపుకోట : అటవీశాఖ ఏలూరు డివిజన్‌ మండలంలోని తడికలపూడి అటవి శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కొత్తూరులోని సచివాలయ సిబ్బందికి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీశాఖ సిబ్బంది మాట్లాడుతూ మానవ మనుగడ ముందుకు సాగాలంటే పర్యావరణాన్ని పరిరక్షించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రతి గ్రామంలో మొక్కలు నాటాలని, నీరు వృథా కాకుండా చూడాలని, కాలుష్య నియంత్రణపై, పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఫారెస్ట్‌ బీట్‌ అధికారులు రాజు, మహబూబ్‌, సచివాలయ సెక్రటరీ మనోజ్‌, వీఆర్‌ఓ రమేష్‌, మహిళా కానిస్టేబుల్‌ రాధా, ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

అన్నేభవన్‌లో కంప్యూటర్‌ శిక్షణ

ఏలూరు రూరల్‌: ఏపీఆర్‌ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పవర్‌పేట అన్నేభవన్‌లో శుక్రవారం ఉచిత కంప్యూటర్‌ శిక్షణ తరగతులను లయన్స్‌ క్లబ్‌ రీడింగ్‌ యాక్షన్‌ ప్రోగ్రాం చైర్మన్‌ వీజీఎంవీఆర్‌ కృష్ణారావు ప్రారంభించారు. హేలాపురి బాలోత్సవ కమిటీ అధ్యక్షుడు ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ నామమాత్రపు ఫీజుతో విద్యార్థులకు కంప్యూటర్‌ శిక్షణ అందిస్తున్నామన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందిస్తామన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా
- ఎ.పోలవరంలో గడపగడపకు మన ప్రభుత్వం


సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ అందజేస్తున్న ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా

జంగారెడ్డిగూడెం రూరల్‌ : పేదవాడి జీవితాల్లో వెలుగులు నింపాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అందిస్తూ ముందుకు సాగుతున్నారని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. జంగారెడ్డిగూడెం మండలం ఎ.పోలవరంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఎలీజా ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పాలన సాగిస్తోందని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం నిధులు కేటాయించి గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. ఒక పక్క సంక్షేమం, మరో పక్క అభివృద్ధి దిశగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లతుంటే ప్రతిపక్షాలు ఓర్వలేక ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నాయన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డికే ముఖ్యమంత్రిగా పట్టం కట్టేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే ఎలీజా అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఎంపీపీ కొదమ జ్యోతి, సర్పంచ్‌ బుద్దాల సీతారామరాజు, వైఎస్సార్‌ సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు ఎంపీటీసీ పసుపులేటి వరలక్ష్మి, కోఆప్షన్‌ సభ్యులు లాల్‌ అహ్మద్‌, సచివాలయాల మండల కన్వీనర్‌ గురజాల పార్థసారథి, ఉప సర్పంచ్‌ కోమటి నాగు, వైఎస్సార్‌ సీపీ నాయకులు బందారు సుబ్బారావు, బెజవాడ నాగరాజు, బుద్దాల అనిల్‌, కొట్టే భద్రరావు, కొట్టే జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి


జంగారెడ్డిగూడెంలో సుందరయ్యకు నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు


కొయ్యలగూడెంలో సుందరయ్యకు నివాళులర్పిస్తున్న కమ్యూనిస్టు నేతలు

జంగారెడ్డిగూడెం : పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని సీపీఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం, పి.సూర్యారావు అన్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సుందరయ్య వర్ధంతిని నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జీవరత్నం, సూర్యారావు మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య దక్షిణ భారతదేశంలో సీపీఎం నిర్మాణానికి ఎనలేని కృషి చేశారన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు, వ్యవసాయ కూలీలకు కూలి పెంపు, భూముల పంపకాలు, కార్మికులకు చట్టాల అమలు, సమాన పనికి సమాన వేతనం తదితర అంశాలపై పోరాటాలు నిర్వహించనప్పుడే సుందరయ్యకు ఘన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు ఎ.ప్రభాకరరావు, ఆర్‌.దుర్గారావు, పటాన్‌, మస్తాన్‌, పట్టణ కమిటీ సభ్యులు ఎస్‌కే సుభాషిని, వి.గోపి, ఎస్‌కే మాబు సుభాని, సీహెచ్‌ మాణిక్యాలరావు, బి.యశ్వంత్‌, లెనిన్‌, ఎ.స్టాలిన్‌, పి.సత్తిబాబు, కె.సునీల్‌ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమం శుక్రవారం కొయ్యలగూడెంలో నిర్వహించారు. సీపీఎం నాయకులు సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన ఆశయాలు నేటి రాజకీయ నాయకులకు ఆదర్శమని పలువురు పేర్కొన్నారు. కొయ్యలగూడెంలో పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు. సీపీఎం నాయకులు శుక్లబోయిన రాంబాబు, సీహెచ్‌ సత్యనారాయణ, కె.దుర్గారావు, కె.సీతారాముడు, డి.వీర్రాజు, సీహెచ్‌ మరిదయ్య, ఎస్‌.శివకుమార్‌, యం.వెంకటేశు, త్రిమూర్తులు, సురేష్‌, గోపి తదితరులు పాల్గొన్నారు.

పోలవరం రూరల్‌ : దక్షిణ భారతదేశ ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి పోలవరం మండలం ఇటికిలకోట గ్రామంలో నిర్వహించారు. సీపీఎం నాయకులు బొరగం చంద్రరావు, జి.వెంకట్రావు మాట్లాడుతూ సుందరయ్య ఆదర్శంతమైన జీవితం గడిపారని, సాయుధ పోరాటంలో 10 లక్షల ఎకరాల భూమిని పంచిన మహనీయుడని అన్నారు. ప్రతి పేదవారికి కూడు, గూడు, గుడ్డ దొరకాలని భావించేవారన్నారు. నిరంతరం పేద బలహీన వర్గాల పక్షాన నిలబడిన మనిషని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

30న మెగా జాబ్‌మేళా


మెగా జాబ్‌మేళా గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వీఆర్‌ ఎలీజా

జంగారెడ్డిగూడెం : ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మే 30 తేదీ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటలవరకూ చింతలపూడి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో మెగా జాబ్‌ మేళా నిర్వహిస్తున్నామని, చింతలపూడి నియోజకవర్గ నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వీఆర్‌ ఎలీజా కోరారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్‌ కార్యాలయం వద్ద నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ స్కిల్‌ డెవలప్‌మెంట్‌ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాబ్‌మేళాలో 18 కంపెనీలు నేరుగా ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హత సాధించిన వారికి అక్కడికక్కడే తన చేతుల మీదుగా ఆఫర్‌ లెటర్‌ ఇస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఏలూరు జిల్లా స్కిల్‌ డెవలప్‌మెంట్‌ అధికారి తమ్మాజీరావు మాట్లాడుతూ ఈ జాబ్‌మేళాలో 18 నుంచి 35 సంవత్సరాలు వయస్సు ఉండి 8వ తరగతి నుంచి పీజీ, ఐటీఐ చదివిన యువతీ యువకులు అర్హులన్నారు. వివరాలకు 96525 03799, 96663 22032, 90008 03414 నంబర్లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ బత్తిన లక్ష్మి, పట్టణ వైఎస్సార్‌ సీపీ అధ్యక్షుడు పీపీఎన్‌ చంద్రరావు, మండల పార్టీ అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, శ్రీనివాసపురం ఇన్‌ఛార్జి సర్పంచ్‌ పొల్నాటి శ్రీనివాసరావు, నాయకులు బత్తిన చిన్నా, కౌన్సిలర్‌ ఉగ్గం దుర్గాప్రసాద్‌ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలి

లింగపాలెం : గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని లింగపాలెం మండల ప్రత్యేకాధికారి బి వెంకటగిరి తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్‌ సమావేశ మందిరంలో మండల స్థాయి అధికారులు, పలు శాఖల ఉద్యోగులతో గ్రామాల్లో జరుగుతున్న నాడు-నేడు, గృహనిర్మాణం, ఉపాధిహమీ, తాగునీరు, పారిశుధ్యం, ఇంకా పలు శాఖలపై ఆయన సమీక్షించారు. ఈసందర్భంగా వెంకటగిరి మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న సచివాలయ, ఆర్‌బీకే, హెల్త్‌సెంటర్ల భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో మంచినీటి సమస్యతలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని కార్యదర్శులకు ఆదేశించారు. ఉపాధి హమీపథకం పనులకు సంబంధించి గ్రామాల్లో కూలీల హజరుశాతం మరింతగా పెంచాలన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం పనులు వేగవంతం చేయాలని ఆ శాఖ ఉద్యోగులకు ఆదేశించారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులను నిర్వర్తించాలన్నారు. సమావేశంలో ఎంపీడీవో ఎస్‌ ఆశీర్వాదం, తహసీల్దార్‌ మురళీకృష్ణ, ఈవో పీఆర్‌డీ రత్నకుమార్‌ పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

మలేరియా జ్వరాల నివారణకు కృషి


పాలకుంటలో జరుగుతున్న స్ప్రేయింగ్‌ పనులు పరిశీలిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం : గిరిజన ప్రాంతంలో వర్షాకాలంలో వచ్చే మలేరియా జ్వరాల నివారణకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు మలేరియా సబ్‌యూనిట్‌ అధికారి పి.పెద్దిరాజు తెలిపారు. మండలంలోని దండిపూడి, తూర్పు రేగులకుంట, పాలకుంట, నాగులగూడెం గ్రామాల్లో జరుగుతున్న మలాథియాన్‌ స్ప్రేయింగ్‌ పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్‌ నుంచి వర్షాలు అధికంగా కురిసే అవకాశం ఉన్నందున గ్రామాల్లో ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా దోమల నివారణకు మలాథియన్‌ స్ప్రేయింగ్‌ పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్రజలు తప్పనిసరిగా దోమతెరలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ బన్నె బుచ్చిరాజు, సిబ్బంది బుజ్జి, బాలాజీ, కనకమ్మ, సత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్‌

టి.నరసాపురం : నాటు సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై కె.సతీష్‌ కుమార్‌ తెలిపారు. తిరుమలదేవిపేట శివారులో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ద్వారకాతిరుమల మండలం జి.కొత్తపల్లికి చెందిన ఎం.సుబ్బారావు అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై నాటు సారాను తరలిస్తూ పట్టుబడ్డాడన్నారు. అతనిని అదుపులోకి తీసుకొని సారాను, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

విద్యుదాఘాతానికి గురై గేదె మృతి

పోలవరం రూరల్‌ : పోలవరం గ్రామంలో పొలాల్లో మేతకు వెళ్లిన గేదె విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. మేత మేసి తిరిగి వస్తున్న సమయంలో తెగిపడిన విద్యుత్‌ వైరు కాళ్లకు తగలడంతో ఏ.ఏసు అనే వ్యక్తికి చెందిన గేదె శుక్రవారం సాయంత్రం మృతిచెందింది.

ఇటుక బట్టీ నూతన కార్యవర్గం

టి.నరసాపురం : టి.నరసాపురం మండల ఇటుక బట్టీల నూతన కార్యవర్గాన్ని బొర్రంపాలెంలో శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గంటా పెద ఆంజనేయులు, కార్యదర్శిగా కైతేపల్లి రమేష్‌, కోశాధికారిగా పడాల గంగాధరరావుతో సహా నలుగురిని సభ్యులుగా ఎన్నుకున్నట్లు ఇటుక బట్టీల సంఘం సభ్యులు తెలిపారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

జంగారెడ్డిగూడెం రూరల్‌ : వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సందేశాన్ని జంగారెడ్డిగూడెం మండల పరిషత్‌ కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు వీక్షించారు. ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెం మండల ప్రత్యేకాధికారి ఎం.రాజు మాట్లాడుతూ ప్రతి మండలంలో ఉత్తమ సేవలందించి పురస్కారాలను ఎంపికైన వలంటీర్లను రాబోయే 10 రోజుల పాటు సత్కరించడం జరుగుతుందన్నారు. జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించే విషయంలో వలంటీర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఎంపీపీ కొదమ జ్యోతి, ఎంపీడీవో కొమ్ము కిరణ్‌కుమార్‌ పాల్గొన్నారు.

ఎస్‌ఈబీ అధికారుల దాడులు

చింతలపూడి : నాగిరెడ్డిగూడెం గ్రామంలో శుక్రవారం ఎస్‌ఈబీ అధికారులు దాడులు నిర్వహించారు. దాడుల్లో భూక్యా దేవి, భూక్యా అమ్ములు అనే మహిళలను అరెస్ట్‌ చేసి వారి నుంచి 4 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సాయి స్వరూప్‌ తెలిపారు. పట్టుబడ్డ ఇరువురు మహిళలను కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌ విధించినట్లు చెప్పారు. దాడుల్లో ఎస్‌ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

సీతానగరంలో చలివేంద్రం ఏర్పాటు

చింతలపూడి : మండలంలోని సీతానగరం గ్రామంలో శ్రీకృష్ణదేవరాయ కాపు సేవా సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రం ప్రారంభించారు. ప్రస్తుతం మెట్ట ప్రాంతంలో ఎండలు అధికంగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బాటసారులు, ప్రయాణీకులు ఎండలో దాహార్తి తీర్చుకునేందుకు ప్రతి గ్రామంలోనూ చలివేంద్రాల ఆవశ్యకత ఉందని పలువురు అభిప్రాయపడ్డారు. గ్రామంలో చలివేంద్రం ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయ కాపు సేవా సంఘం నిర్వాహకుల్ని గ్రామస్తులు అభినందించారు.

చంద్రబాబు అహంకారానికి పరాకాష్ట


పోలవరంలో అంబేడ్కర్‌ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం రూరల్‌ : చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్‌ చేస్తూ ఎ.పోలవరంలో ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా పార్టీ శ్రేణులతో కలిసి శుక్రవారం ధర్నా చేపట్టారు. చంద్రబాబు అహంకార ధోరణి నశించాలని, పేదలపై చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని, డౌన్‌ డౌన్‌ చంద్రబాబు నాయుడు అంటూ ఎమ్మెల్యే నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సెంటు స్థలం ఇళ్లకు పనికిరాదని, శవాలు పూడ్చడానికి పనికొస్తుందని చంద్రబాబు మాట్లాడటం ఆయన అహంకారానికి నిదర్శనమన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో శ్రమించి పేద, బడుగు, బలహీన వర్గాలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి గృహాలు మంజూరు చేస్తూ వస్తున్నారన్నారు. రాష్ట్రంలో ఇల్లు లేని పేదవాళ్లు ఎవరూ ఉండకూడదనే మంచి ఉద్దేశంతో అమరావతిలో 50 వేల మంది పేద మహిళలకు ఇళ్ల స్థలాలను ప్రభుత్వం మంజూరు చేస్తే అడ్డుకునేందుకు చంద్రబాబు ప్రయత్నం చేస్తుండడమే కాకుండా, పేదల ఇళ్ల స్థలాలను శ్మశానంతో పోల్చడం దారుణమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, ఎంపీపీ కొదమ జ్యోతి, సర్పంచ్‌ బుద్దాల సీతారామరాజు, వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

నల్లరిబ్బన్లు ధరించి నిరసన

పోలవరం రూరల్‌ : అమరావతిలో పేదలకిచ్చే ఇళ్ల స్థలాలపై చంద్రబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ పోలవరం గ్రామంలోని ఏటిగట్టు సెంటర్‌లో అంబేడ్కర్‌ విగ్రహం వద్ద వైఎస్సార్‌ సీపీ మండలాధ్యక్షుడు బుగ్గా మురళీకృష్ణ ఆధ్వర్యంలో నల్లరిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల కాలంలో పేద, బడుగు, బలహీన వర్గాలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. పేదలకు సొంతింటి కల నెరవేర్చడంపై ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. జగనన్న ఇళ్ల స్థలాలు మంజూరుచేయడమే కాకుండా ఇళ్లు నిర్మించి ఇస్తూ ఉంటే 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని చెబుతున్న చంద్రబాబు పేదలకు కేటాయిస్తున్న సెంటు భూమిని శ్మశానంతో పోల్చడం దారుణమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓఆర్‌ఎస్‌ ప్యాకెట్ల పంపిణీ


ఉపాధి కూలీలకు ఓఆర్‌ఎస్‌ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

చింతలపూడి : వడదెబ్బ నుంచి రక్షణ కోసం వ్యవసాయ కూలీలు, ఉపాధి హామీ కూలీలు ఓఆర్‌ఎస్‌ ద్రావణాన్ని తీసుకోవాలని ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్‌కే అబ్రార్‌ హుస్సేన్‌ విజ్ఞప్తి చేశారు. వెలగలపల్లి గ్రామంలో శుక్రవారం ఫ్రైడే, డ్రైడే కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అనంతరం ఉపాధిహామీ కూలీలకు ఓఆర్‌ఎస్‌ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండుతున్న ఎండల్లో ఆరుబయట పని చేయడం కారణంగా వడదెబ్బ తగిలే ప్రమాదం ఉందన్నారు. ఎండలో సంచరించేవారు పలుచటి నూలు వస్త్రాలు ధరించడం, గొడుగు వాడటం, ద్రవాహారాలు తీసుకోవడం వంటి జాగ్రత్తలతో వడదెబ్బ నుంచి నివారణ పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ అరుణ, సునీత తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల ప్రతిజ్ఞ


ప్రతిజ్ఞ నిర్వహిస్తున్న గిరిజనులు

కొయ్యలగూడెం : కన్నాపురం ఫారెస్ట్‌ రేంజర్‌ అధికారి కె.కృష్ణకుమారి ఆధ్వర్యంలో పర్యావరణ ప్రాముఖ్యతపై శుక్రవారం బుల్లెంపేట గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉపాధి పనుల్లో పాల్గొన్న పరిసర గ్రామాల గిరిజనుల చేత ప్రతిజ్ఞ చేయించారు. చెరువులలో ప్లాస్టిక్‌ వ్యర్థాల వలన మనుషులతో పాటు మూగజీవాలు వ్యాధులతో మృత్యువాత పడుతున్నాయన్నారు. పర్యావరణంతోనే మానవాళి మనుగడ ఆధారపడి ఉందని, ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు, ప్లాస్టిక్‌ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. 'ఇంటికో మొక్క ఊరికో వనం' ప్రాణికోటికి రక్షణ అంటూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ శ్రీనివాస్‌రెడ్డి, ఫారెస్ట్‌ సెక్షన్‌ ఆఫీసర్లు ఎంఎస్‌ఆర్‌ మూర్తి, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నూకాలమ్మ వార్షికోత్సవం


నూకాలమ్మ అమ్మవారికి శతకలశాభిషేకం నిర్వహిస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని శ్రీ శ్రీ నూకాలమ్మ వార్షిక వేడుకలు శుక్రవారంతో ముగిసాయి. ఆఖరి రోజు అమ్మవారికి అష్టోత్తర శతకలశాభిషేకం అత్యంత వైభవంగా, శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని మాజీ మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ బంగారు శివలక్ష్మి, ఆలయ చైర్మన్‌ డాక్టర్‌ రాజాన సత్యనారాయణ, రామలక్ష్మి దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళా మండలి సభ్యులతో కలిసి అమ్మవారిని ప్రత్యేకంగా అభిషేకించారు. అనంతరం అమ్మవారు విశేషాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, ప్రసాద వితరణకు కారింగుల రామకృష్ణమూర్తి, శ్రీరామనాగరత్నం దంపతులు, వారి కుటుంబ సభ్యులు సహకరించినట్లు రాజాన సత్యనారాయణ తెలిపారు. జలాభిషేక అనంతరం భక్తులకు పీఏ.కృష్ణమూర్తి, సుజాత దంపతుల ద్రవ్య సహాయంతో అన్నప్రసాద వితరణ నిర్వహించగా, ఈకార్యక్రమాన్ని మున్సిపల్‌ కమిషనర్‌ భవానీప్రసాద్‌ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, శ్రీ నూకాంబిక సేవా బృందం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సచివాలయ, అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ


అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో మాట్లాడుతున్న తహసీల్దార్‌

కొయ్యలగూడెం : కలెక్టర్‌ ప్రసన్న వెంకటేష్‌ ఆదేశాల మేరకు పొంగుటూరు సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రం-2లను తహసీల్దార్‌ పాశం నాగమణి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయంలో సిబ్బంది హాజరు, రికార్డుల పరిశీలనతో పాటు, ఇప్పటి వరకు పరిష్కారం కాని సమస్యలను, అందుకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రం-2ను తనిఖీచేసి చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. కేంద్రంలో ఛాయ చిత్రాల ప్రదర్శన ద్వారా విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మక శక్తిని అడిగి తెలుసుకోవడంతో పాటు గర్భిణులు, బాలింతలకు అందుతున్న పౌష్టికాహారం గురించి స్వయంగా వారి ఇళ్ల వద్దకు వెళ్లి ఆరా తీశారు. రెవెన్యూ అధికారులు, అంగన్‌వాడీ సిబ్బంది, సచివాలయాల కన్వీనర్‌లు, ఉద్యోగులు పాల్గొన్నారు.